సాక్షి
నిర్మల్

బుధవారం । 31 । జనవరి । 2024





**ఆ సేవలకు 'స్టాప్' పడేనా..!**

ప్రభుత్వం స్టాఫ్‌నర్స్ రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసింది. దీంతో ప్రస్తుతం రిమ్స్‌లో పనిచేస్తున్న వందల మంది పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. 8లో▸



**నిండు ప్రాణం నిలిపారు**

నిర్మల్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో అరుదైన వైద్య సేవలు అందిస్తున్నారు. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో చేసే చికిత్సలు జిల్లా జనరల్ ఆస్పత్రిలోనే ఉచితంగా చేసి నిండు ప్రాణాలను కాపాడుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/18.9

**వాతావరణం**

ఆకాశం చాలావరకు మేఘావృతమవుతుంది. చల్లగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి.

## న్యూస్‌రీల్

### ఇంద్రవెల్లి సభ విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్:ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఒక ప్రకటనలో కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాచరణ ప్రారంభించారని, ఇందులో భాగంగా ఇంద్రవెల్లి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారని వివరించారు. ఇంద్రవెల్లి సభ నుంచి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తారని తెలిపారు. సీఎం సభకు భారీగా జన సమీకరణ చేస్తున్నామని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి లక్ష మందికి పైగా ప్రజలు హాజరవుతారని వెల్లడించారు.

### రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

నిర్మల్‌టౌన్: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. 160 మంది విద్యార్థులు పాల్గొనగా, 12 మంది బాలికలు, 12 మంది బాలురను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఫిబ్రవరి 3, 4 తేదీల్లో యాదాద్రి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు మారా జీవన్‌రెడ్డి, కార్యదర్శి భూమేశ్, పెటా కార్యదర్శి భోజన్న, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రమణారావు, బ్యాడ్మింటన్ సెక్రెటరీ భూమన్న, సీనియర్ పీడీ బుచ్చి రామారావు తదితరులు అభినందించారు.

### బకాయిలు చెల్లించని దుకాణాలు సీజ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బకాయిలు చెల్లించని రెండు దుకాణాలను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. త్వరలో ఈ దుకాణ సముదాయాలకు టెండర్లు పిలుస్తామని తెలిపారు.

### తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్యే 'ఏలేటి'



తిరుమలలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే

నిర్మల్‌చైన్‌గేట్:నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

### సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



షేడ్‌నెట్లు అందిస్తున్న అధికారులు

మామడ: వ్యవసాయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సీఆర్డీ డైరెక్టర్ జయసుందర్ అన్నారు. మామడ రైతు వేదికలో స్వయంసహాయక సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు గ్రీన్‌షీట్‌నెట్, టైలరింగ్ కిట్‌లు అందించారు. సాగులో నానో యూరియా, నీమ్ ఆయిల్‌ను వాడటం వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పంట దిగుబడుల కోసం ప్రత్యేక పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో రాజేందర్, ఏఈవో సృజిత, ఏపీఎం అరుణ, కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి.. సెంటిమెంట్

- మరోసారి ఈ గడ్డ నుంచే సమర శంఖం..
- లోక్‌సభ ఎన్నికల నగారా మోగించనున్న రేవంత్
- నాటి సభా స్థలమే.. మళ్లీ వేదిక
- అమరవీరుల కుటుంబ సభ్యులతో భేటీ
- విజయవంతం చేయాలని హైదరాబాద్‌లో సీఎం పిలుపు

సాక్షి,ఆదిలాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి గడ్డను సెంటిమెంట్‌గా తీసుకున్నారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకం తర్వాత 2021 ఆగస్టు 9న ఇక్కడే మొదటి సభ నిర్వహించారు. నాడు 'దళిత, గిరిజన దండోరా' పేరిట నిర్వహించిన సభకు లక్షకు పైగా జనం విచ్చేశారు. సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో రేవంత్ రెడ్డి ఇక వెనుదిరిగి చూడలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో పలు సభలు నిర్వహించారు. అప్పటినుంచే కాంగ్రెస్‌పై ప్రజల్లో మక్కువ పెరిగిందన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమైంది. దానికి తగ్గట్టుగానే ఎన్నికల్లో హస్తం పార్టీ విజయం సాధించడం, రేవంత్‌రెడ్డి సీఎం కావడం జరిగిపోయాయి. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నగారాను కూడా ఇంద్రవెల్లి గడ్డ మీదనుంచే మొదలుపెట్టాలని రేవంత్ రెడ్డి నిర్ణయించారు. సీఎం టూర్ ఇదివరకే నిర్ణయం కాగా తేదీ ఖరారు కాలేదు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఫిబ్రవరి 2న తన పర్యటన ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈమేరకు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**అదే వేదిక..**

నాటి సభను ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సమీపంలో నిర్వహించగా.. తాజాగా ఫిబ్రవరి 2న సభను కూడా అదే స్థలంలో చేపట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు సాగుతున్నాయి. తద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇంద్రవెల్లి గడ్డను సెంటిమెంట్‌గా తీసుకొని ముందుకు కదులుతున్నట్లు తెలుస్తోంది.



2021 ఆగస్టులో ఇంద్రవెల్లి సభలో కాలికోం వాయిస్తున్న రేవంత్ రెడ్డి

కాగా ఆ రోజు మొదట కేస్లాపూర్‌కు సీఎం రానున్నారు. నాగోబాకు పూజల అనంతరం పక్కనే ఉన్న గిరిజన దర్బార్ సభ వేదికలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంటారు. అక్కడ నివాళులర్పించిన అనంతరం సభలో పాల్గొననున్నారు. 1981 ఏప్రిల్ 20న జల్ జంగల్ జమీన్ కోసం జరిగిన పోరాటంలో పోలీసు కాల్పుల్లో అమరులైన వారి కుటుంబ సభ్యులతో సీఎం భేటీ కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులు సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు కదులుతున్నారు. మరో వైపు సీఎం జిల్లాకు రానున్న నేపథ్యంలో అధికారిక ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలిస్తున్నారు. బందోబస్తు విషయంలో ఎస్పీ నిశితంగా పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి.

**సవాలే..**

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, శాసనసభ ఎన్నికల్లో నాలుగు బీజేపీ, రెండు బీఆర్‌ఎస్ గెలువగా, ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచే సవాల్‌గా తీసుకొని సెంటిమెంట్‌ను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ రసవత్తరంగా మారనుంది. మొత్తంగా ప్రతికూల పరిస్థితుల నుంచి అనుకూల ఫలితం సాధించే దిశగా పార్లమెంట్ ఎన్నికలకు ఈ గడ్డ మీద నుంచి సమరశంఖం పూరించనున్నారు.

### నేడు మంత్రి సీతక్క రాక..

ఇంద్రవెల్లి: సీఎం ఇంద్రవెల్లి పర్యటనఖరారైన నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బుధవారం ఇంద్రవెల్లికి రానున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ఆధ్వర్యంలో జిల్లా నేతలతో మంగళవారం సమీక్ష జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. నేడు ఉదయం 11 గంటలకు మంత్రి సీతక్క అమరవీరుల స్తూపానికి వచ్చి ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

## ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలి

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్:పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలని, విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని జిల్లా సమన్వయకర్తలు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించకపోవడంపై 'ఫలితం 'పది'లమేనా..!' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య కొండాపూర్, రత్నాపూర్ కాండ్లి ఉన్నత పాఠశాలలను సందర్శించగా, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎన్.ప్రవీణ్‌కుమార్ ఈద్గాం, ప్రియదర్శిని నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, అభ్యాస దీపికల వినియోగం, తదితర అంశాలు పరిశీలించారు. విద్యార్థులు వందశాతం ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యాస కృత్యాలు విస్తృతంగా ఇవ్వాలని సూచించారు. భైంసాలోని ఏపీనగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఎంఈవో సుభాష్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

## ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని సీఐటీయూ పట్టణ నాయకుడు పోశెట్టి కోరారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అంగన్‌వాడీ నిర్మల్ సెక్టార్ జనరల్ బాడీ సమావేశం ప్రియదర్శిని నగర్‌లో మంగళవారం రాజమణి, శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఫిబ్రవరి 16న నిర్వహించే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిస్తూ ఇంటింటికీ వెళ్లి క్యాంపెయిన్ చేయాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 10 ఏళ్లు పూర్తయిన అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు అమలు కావడం లేదని వివరించారు. వచ్చే బడ్జెట్‌లో ఐసీడీఎస్ నిధులు పెంచాలని కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తులసి, అరుణ, శశికళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు పోశెట్టి

## మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

భైంసా: ముథోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోస్లే నారాయణరావుపటేల్ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల, సుజలస్రవంతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ప్యాకేజీ నంబర్ 28 కింద రూ.316.20 లక్షలతో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈపనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. కనకాపూర్ లిఫ్ట్ మరమ్మతులకు రూ.1.54 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా, ఈ పనులు మంజూరయ్యాయన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయించాలని కోరారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో ముంపుకుగురైన గుండేగాం గ్రామ పునరావాసం కోసం రూ.98 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద మంజూరు చేయాలని విన్నవించారు. భైంసా మండలం సిరాల ప్రాజెక్టు భారీ వర్షాలకు తెగి పూర్తిగా దెబ్బతిందని రూ.15.94 కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇందుకుగాను మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నారాయణరావుపటేల్ తెలిపారు.



మంత్రితో మాట్లాడుతున్న నారాయణరావుపటేల్

### వార్షికోత్సవానికి ఎస్పీకి ఆహ్వానం

ఖానాపూర్: పట్టణంలోని జంగల్‌హన్మాన్ శ్రీవీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ 27వ వార్షికోత్సవానికి రావాలని ఆలయ కమిటీ ఎస్పీ జానకి షర్మిలను కోరింది. ఈమేరకు మంగళవారం ఎస్పీని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఫిబ్రవరి 12న జాతర జరుగుతుందని తెలిపారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కూడా ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేందర్, ప్రదీప్, కిశోర్, రాజేశ్వర్, శ్రీనివాస్, సుమిత్, తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె నోటీసు అందజేత



డీఈవోకు సమ్మె నోటీసు అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్:ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తెలిపారు. ఈమేరకు డీఈవో కార్యాలయంలో మంగళవారం సమ్మె నోటీసు అందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె తలపెట్టినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సమ్మెలో పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, సభ్యులు బుచ్చవ్వ, ఆసియాబాను తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎన్‌ఎస్‌ఎస్ సమావేశం

మంచిర్యాలఅర్బన్: జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రోగ్రాం అధికారుల సమావేశం ఈ నెల 31న మంచిర్యాలలో నిర్వహించనున్నట్లు మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఉదారి చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. మేడారం జాతరలో పాల్గొనే వాలంటరీలు, ప్రోగ్రామ్ అధికారులపై చర్చిస్తామని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం కో–ఆర్డినేటర్ ఈసం నారాయణ హాజరు కానున్నారని, 2022–23 సంవత్సరానికి రెగ్యులర్ కార్యక్రమాల నివేదికలతో ప్రోగ్రామ్ అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

# సీఎంఆర్ @ 70%

- నేటితో ముగియనున్న గడువు
- మిల్లుల్లో కనిపించని యాసంగి ధాన్యం



భైంసాటౌన్:రైతుల నుంచి సేకరించిన ధాన్యం సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం రైస్ మిల్లులకు విధించిన గడువు బుధవారం(నేటితో) ముగియనుంది. డిసెంబర్‌లోనే ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా, మిల్లర్ల జాప్యం కారణంగా పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే పలుమార్లు గడువు పెంచారు. జనవరి 31ని తుదిగడువుగా విధించారు. ఈ మేరకు గడువులోగా సీఎంఆర్ పూర్తికి సంబంధిత అధికారులు నెలరోజులుగా మిల్లర్లపై ఒత్తిడి పెంచారు. దీంతో పది రోజుల్లోనే దాదాపు పది శాతం(12,753 మెట్రిక్ టన్నులు) సీఎంఆర్ రికవరీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం సీఎంఆర్ ప్రక్రియ పూర్తి కాగా, మరో 30 శాతం బియ్యం అప్పగించాల్సి ఉంది. బుధవారంతో గడువు ముగియనుండగా, వందశాతం అప్పగించని మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అన్న చర్చ జరుగుతోంది. మరోమారు గడువు పెంపుపై ఎలాంటి ఆదేశాలు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**రబీ ధాన్యం మాయం...!**

2022–23 యాసంగి ధాన్యం వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. జిల్లాలో రైస్‌మిల్లులకు 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, ఇప్పటి వరకు 2,798 మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ పూర్తి చేశారు. ఇంకా 1.04 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం రబీ ధాన్యం వేలానికి నిర్ణయించిన నేపథ్యంలో చాలా మిల్లుల్లో ధాన్యం కనిపించడం లేదు. మిల్లుల్లోనే ధాన్యం ఉన్నట్లు మిల్లర్లు అధికారులకు చూపుతుండగా, క్షేత్రస్థాయిలో నిల్వలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు సైతం పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడించడం లేదు. అధికారులు మిల్లుల వారీగా ధాన్యం నిల్వలు పరిశీలిస్తే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జిల్లాలో 2022–23 సీఎంఆర్ వివరాలిలా(మె.టన్నుల్లో...)**

| | ఖరీఫ్ | రబీ |
|---|---|---|
| కేటాయించిన ధాన్యం | 1,68,177.000 | 1,58,566.320 |
| అప్పగించాల్సిన బియ్యం | 1,12,965.443 | 1,06,831.956 |
| అప్పగించిన బియ్యం | 79,524.380 | 2,798.935 |
| పూర్తయిన శాతం | 70.39 | 02.61 |
| అప్పగించాల్సిన బియ్యం | 33,441.063 | 1,04,033.021 |

### గడువు పెంపు లేదు..

2022–23 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ పూర్తికి ఈనెల 31వరకే గడువు ఉంది. ఇప్పటివరకు 70 శాతం ప్రక్రియ పూర్తయింది. గడువు పెంపుపై ఆదేశాలు లేవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీకళ, ఇన్‌చార్జి డీసీఎస్‌వో

## అమరుల త్యాగం వెలకట్టలేనిది

- ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగం వెలకట్టలేనిదని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ప్రతీ భారతీయుడి హృదయంలో స్వదేశీ, స్వభాష, స్వరాజ్ అనే స్ఫూర్తిని గాంధీ నింపారని తెలిపారు. ఆయన ఆలోచనలు ప్రతీ భారతీయుడిలో స్ఫూర్తి నింపుతాయన్నారు. దేశం కోసం, దేశ ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే లక్ష్యంగా వేలాది మంది స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకుని తమ ప్రాణాలను సైతం అర్పించారని వివరించారు. అలాంటి త్యాగధనులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, డీపీవో(ఏ) సూపరింటెండెంట్ శ్రీనివాస్, (బి) సూపరింటెండెంట్ నర్సమ్మ, ఆర్ఐ రాంనిరంజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న ఎస్పీ జానకి షర్మిల, సిబ్బంది

## సమాజాన్ని చైతన్యపరిచేది సాహిత్యమే..

- ప్రముఖ కథ, నవలా రచయిత డాక్టర్ సంపత్‌కుమార్

నిర్మల్‌ఖిల్లా:ప్రస్తుతం సమాజంలోని యువతరాన్ని చైతన్యవంతం చేసేది సాహిత్యమేనని ప్రముఖ కథా, నవలా రచయిత, వ్యాసకర్త డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'కథా వస్తువులు– సమకాలీనత' అనే అంశంపై మంగళవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి, యువతరానికి సమకాలీన పరిస్థితులపై చైతన్యం చేసేశక్తి కథా ప్రక్రియకే ఉందన్నారు. సాహిత్యంలో కథాప్రక్రియకు విశిష్ట స్థానం ఉందని తెలిపారు. ఇది పఠనాభిరుచి పెంపొందిస్తుందని పేర్కొన్నారు. కథ ప్రక్రియ ద్వారా నేరుగా కావాల్సిన అంశాన్ని లక్ష్యాత్మకంగా పాఠకుడికి స్వల్ప కాలంలో అందించవచ్చన్నారు. కథాప్రక్రియ అధ్యయన పటిమను పెంచుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.భీమారావు మాట్లాడుతూ.. భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కథలు దోహదం చేస్తాయన్నారు. నిత్య జీవితాన్ని అనేక కథలకు ప్రేరణ కోసం వినియోగించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.నరసయ్య, రవికుమార్, అధ్యాపకులు శంకర్, రజిత, రంజిత్, పీజీ రెడ్డి, అజయ్, నరేందర్, రవీందర్, దిలీప్, ఆఫ్రిన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కథాప్రక్రియపై మాట్లాడుతున్న సంపత్‌కుమార్

## విపత్తుల వేళ సమయస్ఫూర్తి ప్రదర్శించాలి

నిర్మల్‌టౌన్: ప్రకృతి విపత్తు, వరదలు, తుపాన్లు, భూకంపాల సమయంలో, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తి ప్రదర్శించాలని ఎన్డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది సూచించారు. విపత్తుల సమయంలో మనల్ని రక్షించుకుంటూ ఇతరులను ఎలా రక్షించాలి అనేఅంశంపై ఆల్ఫోర్స్ ఈ–టెక్నో, వైఎస్సార్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. జాతీయ విపత్తుల అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. నీటిలో మునిగిన వారికి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, గ్యాస్ సిలిండర్ లీక్ అయినప్పుడు ఎలా అరికట్టాలి అని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ వెంకటరమణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

## బరువు తక్కువ ఉన్న పిల్లలకు పౌష్టికాహారం

పెంబి: బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తగిన పౌష్టికాహారం అందించాలని ఏసీడీపీవో ప్రతాప్, స్టేట్ కోఆర్డినేటర్ ఉమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని స్టేట్ టీం కమిషనరేట్ హైదరాబాద్ వారు మంగళవారం సందర్శించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని సూచించారు. పిల్లల బరువు, ఎత్తు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, తక్కువ బరువు ఉన్న పిల్లలకు బాలామృతం ఇవ్వాలన్నారు. బలహీనంగా ఉంటే ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు లబ్ధిదారుల హాజరు ఫోన్‌లో వేయాలని తెలిపారు. ఇందులో సీడీపీవో సరిత, సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్ విశ్వరూప తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

## క్లుప్తంగా

### పూలే దంపతులపై మరాఠీలో సినిమా

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులపై మరాఠీలో 'సత్యశోధక్' సినిమా తీశారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మాలీ కులస్తులంతా తప్పకుండా చూడాలని అఖిల భారతీయ మాలి మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాలీ సంఘ క్రియాశీల కార్యకర్తల కృషి వల్ల తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న కే.బీ థియేటర్లో ఫిబ్రవరి 2వ తేదీన విడుదల కానుందన్నారు. ప్రతిరోజు నాలుగు షోలు ఉంటాయని, డీఆర్డీఏ అధికారుల కృషి వల్ల ఈ సినిమా తెలంగాణ వాదులకు ముఖ్యంగా తెలంగాణ మాలీలకు, బహుజనవాదలందరికీ అందుబాటులోకి రావడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు.

### 1న ఓటరు జాబితా పరిశీలకురాలి రాక

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలిగా నియామకమైన రాష్ట్ర పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ స్పెషల్ సెక్రటరీ భారతీ లక్పతి నాయక్ ఫిబ్రవరి 1న నిర్మల్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో ఓటరు జాబితా తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లుగా వెల్లడించారు. నాలుగు జిల్లాల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

### కొనసాగుతున్న పూసాయి జాతర



పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని పూసాయి ఎల్లమ్మ ఆలయంలో జాతర కొనసాగుతోంది. నెల రోజుల పాటు కొనసాగే ఈ జాతరకు భక్తులు ఆది, మంగళవారాల్లో ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. కాగా మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున పూసాయికి చేరుకొని, అమ్మవారికి పూజలు చేశారు. కోనేరులో స్నానం చేసి, అభిషేకాలు గావించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, అక్కడే పిండి వంటలు వండుకొని భోజనాలు చేశారు.

### సందడిగా గంగా జాతర



రథానికి పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగానదీ తీరంలో రామానంద్, మాదవ్‌రావ్ మహారాజ్ ఆలయాల వద్ద వెలిసిన గంగ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంగళవారం మూడో రోజు సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి గంగమ్మ తల్లికి, రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామానంద్, మాదవ్‌రావ్ మహారాజ్ ఆలయాల్లో సైతం పూజలు నిర్వహించి స్వామి వారి పాదులను దర్శించుకున్నారు. గంగానదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, అభిషేకాలు గావించారు.



# ఆ సేవలకు 'స్టాఫ్' పడేనా..!



జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి

- రిమ్స్‌లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్న నర్సుల పోస్టులు
- రెగ్యులర్ భర్తీతో వాటికి ముగింపా..?
- కొత్తవారు చేరిన తర్వాతే స్పష్టతనంటున్న అధికార వర్గాలు
- నేడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకోనున్న వైనం

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో ప్రభుత్వ శాఖల పరంగా చూస్తే అత్యధిక కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నది రిమ్స్ ఆస్పత్రిలోనే. అన్ని విభాగాల్లోనూ వందలాది పోస్టులు ఈ విధానంలో కొనసాగుతున్నాయి. స్టాఫ్ నర్సులకు సంబంధించి పెద్ద సంఖ్యలో ఈ పద్ధతిలో కొనసాగుతుండగా, తాజాగా ప్రభుత్వం రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయగా, జిల్లాలో వందలాది మంది వీటికి ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వారు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకోనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి డ్యూటీలో చేరనున్నారు. దీంతో ప్రస్తుతం రిమ్స్‌లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్న వారి పరిస్థితి ఏమిటన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. కొత్తవారు పోస్టుల్లో చేరిన తర్వాతే దీనిపై ఒక నిర్ణయం తీసుకునే వీలుంటుందని అధికార వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

**ఇది పరిస్థితి..**

రిమ్స్ ఆస్పత్రిలో 351 రెగ్యులర్ స్టాఫ్‌నర్సు పోస్టులు ఉన్నాయి. ఇందులో 121 మంది రెగ్యులర్ ఉద్యోగులు కొనసాగుతుండగా, 230 ఖాళీలు ఉన్నాయి. ఈ ఖాళీల్లో ప్రస్తుతం 144 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సేవలు అందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం స్టాఫ్ నర్సు రెగ్యులర్ పోస్టులను ఎంపిక చేయగా, జిల్లా నుంచి ఏకంగా 282 మంది వీటికి సెలెక్ట్ అయ్యారు. ఫిబ్రవరి 1న కొత్త ఉద్యోగులు డ్యూటీలో చేరనున్నారు. అయితే డీఎంహెచ్‌వో పరిధిలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో మొత్తం 34 పోస్టులకు ప్రస్తుతం 9 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. కొత్తగా రెగ్యులర్ పోస్టులో చేరేవారు అత్యధికంగా రిమ్స్‌లోనే చేరే పరిస్థితి. జోన్-2 బాసర పరిధిలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్‌లోనూ వీరు వివిధ ఆస్పత్రుల్లో చేరేందుకు అవకాశం ఉంది.

**మళ్లీ పొడగింపు ఉంటుందా..?**

ఒకవేళ ఎక్కువ మంది రిమ్స్‌లోనే చేరితే మాత్రం ప్రస్తుతం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్న వారి సేవలను పొడగిస్తారా.. లేనిపక్షంలో ఎలాంటి నిర్ణయం ఉంటుందనేది చూడాల్సిందే. మార్చి 31 వరకు వీరి కాంట్రాక్ట్ గడువు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత పొడగింపు ఉంటుందా.. లేనిపక్షంలో పరిస్థితి ఏమిటి అనే విషయంలో కొత్తగా పోస్టుల్లో చేరేవారి సంఖ్యను బట్టి ఉంటుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై ఎప్పుడే ఏమి చెప్పలేమంటున్నారు. ఆస్పత్రిలో కీలకమైన నర్సుల పోస్టులు ఎన్నో ఏళ్ల తర్వాత రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ కానుండడంతో రిమ్స్‌లో వైద్య సేవలు మరింత పటిష్టం కానున్నాయనే అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో ప్రస్తుతం కొనసాగుతున్న స్టాఫ్ నర్సుల విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందని కూడా వారు టెన్షన్ పడుతున్నారు.

**విధి విధానాలు వస్తేనే స్పష్టత..**



స్టాఫ్ నర్సులు ఎంపికైనప్పటికీ వారి చేరిక విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి విధివిధానాలపై స్పష్టత లేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు నడుచుకోవాల్సి ఉంటుంది. రిమ్స్‌లో ప్రస్తుతం కొనసాగుతున్నటువంటి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలోనూ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే ముందుకెళ్తాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

## వివాదాస్పద ఉపాధ్యాయులను బదిలీ చేయాలి



మాట్లాడుతున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వివాదాస్పద ఉపాధ్యాయులు శామ్యూల్, వీరయ్యలను వెంటనే బదిలీ చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని లక్కారం గ్రామస్తులు అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్రం తిరుపతి, నీలాబాయి, అన్నపూర్ణ, తొగరి రఘు, కాల్వ రవి మాట్లాడారు. ఇటీవల ఉన్నత పాఠశాల నూతన భవనానికి పాత పాఠశాల నుంచి విద్యార్థులతో సామగ్రిని మోపిస్తూ ఉన్న ఉపాధ్యాయులను గ్రామస్తులు రాకేశ్ అనే యువకుడు ప్రశ్నించగా ఆయనపై ఉపాధ్యాయుడు శామ్యూల్ దాడిచేశారని, దీంతో రాకేశ్ సైతం ఉపాధ్యాయుడిపై చేయిచేసుకున్నాడని తెలిపారు. ఇదే అదునుగా సదరు ఉపాధ్యాయుడు రాకేశ్‌పై ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేసి కులం పేరుతో దూషించాడని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించాడని వివరించారు. గతంలో ఈ పాఠశాలలో పనిచేసిన స్వామి ఉపాధ్యాయుడిపై కూడా సదరు ఉపాధ్యాయుడు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా ఉన్న సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడని, పోలీసులు ఉపాధ్యాయుడిపై ఫోక్స్ చట్టం కేసు నమోదు చేశారని వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సెలబస్ పూర్తి చేయడంలో విఫలమవతున్నారని ఆరోపించారు. ఈ వివాదస్పద ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. ఈ విషయమై ఉపాధ్యాయుడు శామ్యూల్‌ను వివరణ కోరగా.. పాఠశాల సమస్య ఏదైనా ఉంటే పాఠశాల హెచ్‌ఎంను అడిగాలి కాని తనతో వాగ్వాదానికి దిగి తనపై దాడి చేయడం, అసత్య ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

## అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

దస్తురాబాద్: మండలంలోని మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొండుగూడ గ్రామానికి చెందిన ఒకరు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. గోండుగూడ గ్రామానికి చెందిన పేంద్రం సంగు(45)ను సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన మత్తె పెద్దసత్తయ్య అనే వ్యక్తి గ్రామ సమీపంలోని తన పొలంలో నీరు పారించడానికి తీసుకెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో సుంగు భార్య మహదుబాయి రెండుసార్లు ఫోన్‌చేయగా కలవకపోవడంతో మరుసటి రోజు ఉదయం పెద్దసత్తయ్య పొలానికి వెళ్లింది. దీంతో సుంగు పొలం సమీపంలో బురదనీటిలో పడి కనిపించడంతో కేకలు వేయడంతో కేకలు వేయడంతో సమీపంలోని గ్రామస్తులు మధు, రాము చూడగా అప్పటికే మృతిచెందాడు. అతడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 'డబుల్' కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని రాంపూర్-టి గ్రామంలో గతంలో మంజూరైన 100 డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించిన కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించారు. రాంపూర్ గ్రామంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇండ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేసి, లబ్ధిదారులే ఇండ్లు నిర్మించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్‌కు అవసరమై సూచనలు జారీ చేస్తామని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, రాంపూర్ సర్పంచ్ అల్లం లింగన్న, తదితరులు ఉన్నారు.

## గ్రామదేవతలకు బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

తానూరు: మండలంలోని ఎల్విలో మంగళవారం గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా మాదిరి భక్తులు బోనాలు ఎత్తుకొని మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులున్నారు.

### ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

భైంసాటౌన్: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన భైంసా పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై అమోస్ కథనం ప్రకారం.. పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అలీం(46) మంగళవారం స్థానిక పిప్రి కాలనీ నుంచి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని బస్టాండ్ వైపు వస్తుండగా ఖద్దా హోటల్ వద్ద ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అలీమ్ తలకు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న వనితకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అలీం మృతి చెందినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నూతన నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న సాయితేజ

ఆదిలాబాద్: నెహ్రూ యువ కేంద్ర సంఘటన జిల్లా అడ్వైజరి బోర్డు సభ్యుడిగా జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీకి చెందిన సాయి తేజ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర క్రీడల, యువజన వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పాయల్ శంకర్ నివాసంలో ఎమ్మెల్యే మంగళవారం సాయితేజకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి తేజ మాట్లాడుతూ తనను సభ్యుడిగా నియామకం చేయడం పట్ల కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, ఎంపీ సోయం బాపూరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

భైంసా: బాసర ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 77రోజుల హుండీ ఆదాయం భక్తులు లెక్కించారు. నగదు రూ.84లక్షల 70వేల 278, మిశ్రమ బంగారం 142 గ్రాములు, మిశ్రమ వెండి నాలుగు కిలోల 640 గ్రాములు, 114 విదేశీ కరెన్సీ లభ్యమైనట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. హుండీ లెక్కింపులో యూబీఐ బ్యాంకు సిబ్బంది, బాసర పోలీసు సిబ్బంది, హోంగార్డ్, వాగ్దేవి సొసైటీ సభ్యులు, చీరాలకుచెందిన బ్రహ్మారాంభసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

ముధోల్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు సీఐ మల్లేష్ తెలిపారు. వివరాల ప్రకారం... భైంసా నుంచి ధర్మాబాద్‌కు 16క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ముధోల్‌లో వాహనాన్ని తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం లభ్యమయ్యాయి. పట్టుకున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

# నిండు ప్రాణం నిలిపారు

- జనరల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలు



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో అరుదైన వైద్య సేవలు అందిస్తున్నారు. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో చేసే చికిత్సలు జిల్లా జనరల్ ఆస్పత్రిలోనే ఉచితంగా చేసి నిండు ప్రాణాలను కాపాడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ ప్రాంతంలో జరిగిన దాడిలో అనంతపేట చెందిన ఒక వ్యక్తి మృతిచెందగా అతడి అల్లుడు వెంకటేష్ తీవ్రంగా గాయాలపాలై కడుపులోని పేగులు బయటకు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని చూసిన ప్రతిఒక్కరూ హైదరాబాద్ లాంటి నగరాలకు తీసుకువెళ్లినా బతకలేడకున్నారు. సంఘటన జరిగిన ప్రదేశం నుంచి నేరుగా క్షతగాత్రుడిని అంబులెన్స్ ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బీపీ పల్స్ పూర్తిగా పడిపోయి అపరస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్‌ను వైద్యులు పరీక్షించి ఆలస్యం చేయకుండా ఆపరేషన్ చేయాలని పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఆస్పత్రి సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో సర్జన్ డాక్టర్ గణేష్, మత్తు వైద్య నిపుణులు రమ్య, ఓటి సిబ్బంది మనోహర్, రమ్య మూడు గంటలు కష్టపడి ఆపరేషన్ చేశారు. దాదాపు 18రోజులు అతడిని జిల్లా ఆసుపత్రి సిబ్బంది అన్ని రకాల సేవలు ఉచితంగా చేసి సోమవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ మంగళవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జిల్లా ఆసుపత్రి, జనరల్ ఆసుపత్రిగా అప్ గ్రేడ్ అయిన తర్వాత జిల్లా వాసులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి వైద్యమైన జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తామన్నారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటీలో త్యాగరాయస్వామి ఆరాధనోత్సవం



జ్ఞాపికను ఇస్తున్న డైరెక్టర్ సతీశ్‌కుమార్



కీర్తనలో పాల్గొన్న విద్యార్థులు

భైంసా: ప్రముఖ వాగేయకారుడు త్యాగరాయస్వామి 177వ వర్ధంతి సందర్భంగా బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. త్యాగరాయ ఆరాధనోత్సవాలను డైరెక్టర్ సతీశ్‌కుమార్ ప్రారంభించారు. శాస్త్రీయ సంగీతం, వీణ, వయోలిన్, కూచిపుడి నృత్యంతోపాటు పలు కళల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డైరెక్టర్ సతీశ్‌కుమార్ జ్ఞాపికలు అందించారు.

## దోడందకు 'మెస్రం' పాదయాత్ర

- గ్రామ పొలిమేరలో మామిడిచెట్టుపై గంగాజలం భద్రపరిచిన వంశీయులు



పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం సేకరణలో భాగంగా కేస్లాపూర్ నుంచి మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్ర మండలంలోని దోడంద గ్రామానికి చేరుకుంది. ఈ నెల 28న జన్నారం మండలంలోని హస్తిన మడుగులో ప్రత్యేక పూజల మధ్య గంగాజలం సేకరించిన వారు అదే రోజు తిరుగు పయనమయ్యారు. ఉట్నూర్ మీదుగా మంగళవారం సాయంత్రం దోడంద గ్రామ పొలిమేరకు చేరుకున్నారు. పవిత్ర గంగాజలాన్ని మెస్రం వంశ అల్లుడి సాయంతో మామిడి చెట్టుపై భద్రపరిచారు. అనంతరం తమ గ్రామాలకు బయల్దేరి వెళ్లారు. ఫిబ్రవరి 5న తిరిగి ఇక్కడికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుంటారు. ప్రత్యేక పూజల అనంతరం అదే రోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలో గల వడమర (మర్రి చెట్టు)కు చేరుకొని బస చేస్తారు. మూడు రోజుల పాటు అక్కడే తూమ్(కర్మఖాండ)పూజలు చేయనున్నట్లు ప్రధాన్ సమాజ్ పెద్ద దాదారావ్ తెలిపారు. పుష్యమాస అమవాస్య పురస్కరించుకొని 9వ తేదీన పవిత్ర గంగా జలంతో నాగోబాను అభిషేకించి మహాపూజ అనంతరం జాతరను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రలో మెస్రం వంశీయులు దేవ్‌రావ్, ధర్ము, గణపతి, తిరుపతి తదితరులున్నారు.

## కొలాం గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రం



సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి పీవో

ఇంద్రవెల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం అమలులో భాగంగా కొలాం గిరిజనుల ఆధార్ కార్డులు అప్‌డెట్ కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండలంలోని లిమ్‌గూడ గ్రామాన్ని సందర్శించారు. కొలాం గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు, స్థితిగతులు, జీవన విధానం, గ్రామంలో జరిగిన అభివృద్ధి, చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా కొలాం గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, మురుగు కాల్వలు, పారిశుధ్యం, విద్యా,వైద్యం, ఇండ్లు, వ్యక్తిగత రుణా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కొలాం గిరి జనులందరూ ఏర్పాటు చేయనున్న ఆధార్ కేంద్ర ంలో ఆధార్ అప్‌డెట్ చేయించుకోవాలని సూచించారు.

## జిల్లా సదస్సును జయప్రదం చేయండి


- రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్




మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఎదులాపురం: దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్‌బంద్ విజయవంతానికై ఫిబ్రవరి 5న కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కేంద్ర కార్మిక, రైతు సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తోందని, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 16న కేంద్ర కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్‌బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు, కర్షకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు బండి దేవిదాస్, టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, టీఆర్ఎస్ కేవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, జిల్లా అధ్యక్షుడు కడదరపు అశోక్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు దండెకర్ వామన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, ఏఐకేఎస్ జిల్లా నాయకులు చిల్క దేవిదాస్, బండి దత్తాత్రి, జిల్లా నాయకులు నహీం, ఆశన్న, అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

### ఇసుకాసురులు





జిల్లాలో పెన్‌గంగా నది వద్ద ఇసుకాసురుల హవా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో రవాణా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. నది ప్రవాహానికి ఇసుకతో అడ్డుకట్ట వేసి తమ పని యథేచ్ఛగా కానిచ్చేస్తున్నారు. నిత్యం ట్రాక్టర్లలో వందల టిప్పులు అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండడం గమనార్హం. జైనథ్ మండలం సాంగ్వి గ్రామం వద్ద గల పెన్‌గంగా నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా మంగళవారం కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్